అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రూ.4 కోట్లతో కాటారం ఐటీఐ కళాశాల అప్‌గ్రేడేషన్
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్‌బాబు
- పాలిటెక్నిక్ హాస్టల్, పీహెచ్‌సీ భవనాల ప్రారంభం
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కాటారం/ మహదేవపూర్, ఫిబ్రవరి 5 : రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కాటారం మండలం కొత్తపల్లిలో రూ.3 కోట్లతో నిర్మించిన పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్ భవనం, కాటారం పీహెచ్‌సీలో రూ.20లక్షలతో నిర్మించిన డాక్టర్ క్వార్టర్స్, రూ.16లక్షలతో నిర్మించిన బర్త్ వెయిటింగ్ రూమ్‌లు, మహదేవపూర్‌లో రూ.1.20 కోట్లతో నిర్మించిన మండల పరిషత్ కార్యాలయ సముదాయం, సమావేశ మందిరం, సూరారం అంగన్‌వాడీ కేంద్రం, టస్సార్ కాలనీలో నిర్మించిన రెండు పెడ్లను కలెక్టర్ భవేశ్‌మిశ్రాతో కలిసి మంత్రి సోమవారం ప్రారంభించారు. మహదేవపూర్ మండలంలో ఐసీడీఎస్ సమావేశ మందిర నిర్మాణం, కస్తూర్బా బాలికల పాఠశాల ప్రహరీ, ఐసీడీఎస్ సమావేశ మందిరం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడారు. కాటారం పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినులకు హాస్టల్ కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. సుమారు రూ.4 కోట్లతో కాటారం ఐటీఐ కళాశాల అప్‌గ్రేడ్ చేయనున్నట్లు చెప్పారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలో అవసరమైన నూతన కోర్సులు ప్రవేశపెట్టి నైపుణ్యాలను పెంపొందించే దిశగా శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు

కొత్తపల్లిలో పాలిటెక్నిక్ హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

చేసి కోర్సు ముగియగానే అందరికీ ఉద్యోగ అవకాశాలు లభించేలా చూస్తామన్నారు. ప్రత్యేక నిధులతో కాటారం మండలాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దడంతో పాటు విద్యా హబ్‌గా తీర్చిదిద్దుతానన్నారు. ఈ ప్రాంత రైతాంగానికి ఉపయోగపడే చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను అతి త్వరలోనే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. అధికారులు చిత్తశుద్ధితో పని చేసి ఈ ప్రాంతంలో ఉన్న సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నారాయణ, డీఎంహెచ్‌వో మధుసూదన్, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, డీఎల్‌పీవో సుధీర్ కుమార్, ఎంపీపీలు పంతకాని సమ్మయ్య, బన్సోడ రాణీబాయి, మల్హర్‌రావు, మహదేవపూర్ జడ్పీటీసీ అరుణా శ్రీనివాస్, ఎంపీటీసీలు జాడి మహేశ్వరి, మహేశ్ రవీందర్‌రావు, తోట జనార్దన్, రూపాదేవి ఉమ్‌సింగ్, రేవెల్లి మమతా నాగరాజు, తిరుమల, ఆకుతోట సుధాకర్, మంచినీళ్ల దుర్గయ్య, మాజీ సర్పంచ్ రఘువీర్, మాజీ ఉప సర్పంచ్ నాయిని శ్రీనివాస్, ఎంపీడీవోలు శంకర్, రవీంద్ర నాథ్, తహసీల్దార్లు నాగరాజు, లక్ష్మీరాజయ్య, సీడీపీవో రాధిక ,కాటారం మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీవో ఉపేంద్రయ్య, వైద్యులు మౌనిక, ప్రమోద్, ప్రియాంక, ప్రిన్సిపాల్ గోవర్ధన్, డీసీసీ అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సందీప్, ప్రభాకర్, రమేశ్‌రెడ్డి, సమ్మిరెడ్డి, శ్రీహరి, నవీన్‌రావు, లచ్చిరెడ్డి, రాజు, విక్రమ్, స్వప్న, సుజాత, సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

బ్యాలెట్ యూనిట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ భవేశ్‌మిశ్రా, అధికారులు

పారదర్శకంగా ఈవీఎం ఫస్ట్ లెవల్ చెకింగ్

భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 5 : భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎం యంత్రాల ఫస్ట్ లెవల్ చెకింగ్ ఈసీఐఎల్ ఇంజినీర్ల బృందం ఆధ్వర్యంలో 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. సోమవారం 100 పడకల దవాఖాన ఆవరణలోని ఈవీఎం గోదాములో మిషన్ల ఫస్ట్ లెవల్ చెకింగ్‌ను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో పారదర్శకంగా చెకింగ్ చేయనున్నట్లు చెప్పారు. ఫస్ట్ లెవల్ చెకింగ్ ముగిసిన తర్వాత వెయ్యి మంది ఓటర్లతో మాక్ పోలింగ్ నిర్వహిస్తామన్నారు. అప్పుడు కంట్రోల్ యూనిట్ లో వచ్చిన ఓట్ల వివరాలు, వీవీ ప్యాట్ స్లిప్పుల వివరాలను చెక్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన అడ్మిషన్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. తల్లిదండ్రులకు ఆర్థిక భారం కలుగకుండా ప్రభుత్వ కళాశాలల్లోనే చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ భవేశ్‌మిశ్రా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. డబుల్ బెడ్‌రూమ్‌లు, భూ సమస్యల పరిష్కారం కోసం 42 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వాటిని పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

నిరాహార దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న కోగిల మహేశ్

దళిత బంధుపై అసెంబ్లీలో ప్రకటన చేయాలి

ఏటూరునాగారంలో లబ్ధిదారుల నిరాహార దీక్ష

ఏటూరునాగారం, ఫిబ్రవరి 5 : దళిత బంధుపై అసెంబ్లీలో ప్రకటన చేయాలని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను వెంటనే తమ ఖాతాల్లో జమచేయాలని కోరుతూ లబ్ధిదారులు మండలకేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం ఎదుట సోమవారం నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా దళిత బంధు లబ్ధిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోగిల మహేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటన చేయకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా అంబేద్కర్ అభయహస్తం పథకం కింద రూ.12లక్షలు ఇవ్వాలన్నారు. అన్యాయం చేయాలని చూస్తే పార్లమెంటు ఎన్నికల్లో తమ బలం చూపిస్తామన్నారు. నిరాహార దీక్షలో జిల్లా కార్యదర్శి మడికింద రమేశ్, గౌరవ సలహాదారుడు చిట్టిమల్ల సమ్మయ్య, గోవిందరావుపేట మండల కమిటీ అధ్యక్షుడు దర్శనాల సంజీవ, సలహాదారుడు చుక్క గట్టయ్య, జిల్లా, మండల కమిటీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. కాగా, పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్, నాయకులు దన్నపునేని కిరణ్, అంతటి నాగరాజు నిరాహార దీక్షకు మద్దతు ప్రకటించారు.

రామప్పలో మాంసాహార భోజనం

ప్రాంగణంలో విద్యార్థులకు చికెన్ బిర్యానీ ■ చర్యలు తీసుకోవాలంటున్న భక్తులు

వెంకటాపూర్, ఫిబ్రవరి 5 : రామప్ప దేవాలయం ప్రాంగణంలో విద్యార్థులకు మాంసాహార భోజనం పెట్టడం వివాదాస్పదమైంది. ఈ ఘటన శనివారం జరుగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, భక్తుల కథనం ప్రకారం.. హనుమకొండకు చెందిన బాలజ్యోతి క్రిష్టియన్ స్కూల్ యాజమాన్యం విద్యార్థులను విహారయాత్రలో భాగంగా రామప్పకు తీసుకొచ్చారు. ఆలయ సందర్శన అనంతరం అదే ప్రాంగణంలోని గార్డెన్‌లో విద్యార్థులకు చికెన్ బిర్యానీ వడ్డించారు. ఆలయ సందర్శనకు వచ్చిన భక్తులు వారిని చూసి అడ్డు చెప్పారు. తాము ఆలయంలో తినడం లేదని ఇది పార్క్ అని సిప్టర్లు తెలుపగా భక్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ వీడియో తీయడంతో విద్యార్థులను అక్కడి నుంచి తీసుకెళ్లారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు, సిబ్బంది నిఘా ఉంచాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు. ఆలయాన్ని అపవిత్రం చేసిన వారిపై, వారికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్ష ఫీజు గడువు 21

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 5 : ఓపెన్ ఇంటర్, టెన్త్ పరీక్ష ఫీజు ఈ నెల 21 లోపు చెల్లించవచ్చని డీఈవో ఎన్ రాంకుమార్, ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి మందల రవీందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్‌లో ఫీజును సంబంధిత పాఠశాల కో ఆర్డినేటర్లకు ఫిబ్రవరి 21 లోపు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించవచ్చన్నారు. రూ.25 ఫైన్‌తో ఫిబ్రవరి 27, రూ.50తో మార్చి 4 వరకు చెల్లించవచ్చని వారు తెలిపారు.

మున్సిపల్ ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఎమ్మెల్యే

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 5 : భూపాలపల్లి మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. మున్సిపల్ యాక్ట్ -2019 ప్రకారం కొత్తగా ఎన్నికైన శాసన సభ్యులు మున్సిపల్ ఎక్స్ అఫీషియో మెంబర్‌గా కొనసాగుతారు. క్యాంపు కార్యాలయంలో పలువురు కౌన్సిలర్ల సమక్షంలో మున్సిపల్ కమినర్ అనిల్‌కుమార్ ఎమ్మెల్యేతో ప్రమాణ స్వీకారం చేయించారు.

సమస్యలు పరిష్కరించాలి

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 5 : తెలంగాణ మున్సిపాలిటీ వర్కర్స్, ఎంప్లాయీస్ కనీసం వేతనంతో పాటు న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆ కమిటీల ఆధ్వర్యంలో సోమవారం కమిషనర్ అనిల్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. 16న ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొంటారని పేర్కొన్నారు. యూనియన్ నాయకులు బండారి బాబు, శీలపాక నర్సయ్య, నంగావత్ దేవేందర్, రాజు నాయక్, బూత్కూరి శ్రీనివాస్, మంతెన రాధాకృష్ణ, పీ ప్రశాంత్ పాల్గొన్నారు.

మార్కెట్‌లో మహిళా రైతుకు గుండెపోటు

కాశీబుగ్గ, ఫిబ్రవరి 5: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఓ మహిళా రైతు సోమవారం గుండెపోటుకు గురైంది. వివరాల్లోకి వెళ్తే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చిల్పురు గ్రామానికి చెందిన సూర రమ, సమ్మయ్య దంపతులు 11 మిర్చి బస్తాలను మార్కెట్‌కు తీసుకొచ్చారు. ఈ క్రమంలో మిర్చి యార్డులోనే రమకు గుండెపోటు రావడంతో అస్వస్థతకు గురై బస్తాల మధ్యలో పడిపోయింది. వెంటనే అడ్డి వ్యాపారులు, కార్మికులు మార్కెట్ అధికారులకు సమాచారం అందించారు. వారు 108కు సమాచారం అందించి మార్కెట్ పరిధిలోని డిస్పెన్సరీ కంపౌండర్ స్వామి ఆమెకు సీపీఆర్ చేశాడు. అనంతరం దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

విద్యార్థులకు పదో తరగతి కీలకం

ఎంఈవో రఘుపతి

గణపురం, ఫిబ్రవరి 5 : ప్రతి విద్యార్థికి పదో తరగతి కీలకమని ఎంఈవో రఘుపతి అన్నారు. సోమవారం గణపురం కస్తూర్బా పాఠశాలలో జరుగుతున్న టెన్త్ ప్రత్యేక పరీక్షలను ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు పరీక్షల్లో భయాన్ని వీడి మానసిక ప్రశాంతతో పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ఎప్పటికప్పుడు పరీక్ష పత్రాలు మూల్యాంకనం చేసి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు.

నమ్మక్క గద్దెను దర్శించుకుంటున్న భక్తులు

వనదేవతల సన్నిధిలో భక్తులు

తాడ్వాయి, ఫిబ్రవరి 5 : వనదేవతలు మేడారం సమ్మక్క-సారలమ్మను దర్శించుకొని భక్తులు తరించిపోతున్నారు. అమ్మవార్లకు పూజలు నిర్వహించి తల్లుల దీవెనలు పొందుతున్నారు. సోమవారం పలు రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరాగా దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. మొక్కుల అనంతరం జాతర పరిసరాల్లో విడిది చేశారు. భక్తులతో గద్దెలు, జాతర పరిసరాలు రద్దీగా మారాయి. దర్శనానికి క్యూలో వచ్చే భక్తులకు ఎండ, వానల నుంచి రక్షణ కల్పించేందుకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో చలువ పందిళ్ల పనులు చేపడుతున్నారు. అమ్మవార్ల గద్దెలకు ఇరువైపులా, వెనక భాగం, సారలమ్మ కొట్‌గేట్ వద్ద ఉన్న లైన్లకు తడకలు ఏర్పాటు చేస్తున్నారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మహదేవపూర్, ఫిబ్రవరి 5 : మండలంలోని అంబట్‌పల్లి పాఠశాల విద్యార్థులు చరణ్, శివమనోజ్, చరణ్ చెక్‌ముకి పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి, సోషల్ టాలెంట్ టెస్టులో పవన్ ప్రథమ, సులేమాన్ ద్వితీయ బహుమతిని సాధించారు. వారిని హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు సోమవారం అభినందించి సన్మానించారు.

గణపురం పీఏసీఎస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

గణపురం, ఫిబ్రవరి 5 : గణపురం పీఏసీఎస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం సోమవారం నెగ్గింది. మొత్తం 13 మంది సభ్యులుండగా చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. అవిశ్వాసానికి అనుకూలంగా 12మంది ఓటు వేశారు. కాగా, ఉపాధ్యక్షుడు సిరిగినేని బాబురావును తాత్కాలిక చైర్మన్‌గా ఎంపిక చేశారు. ఈనెల 9న చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నట్లు జిల్లా సహకార అధికారి శైలజ తెలిపారు.

మార్చి 3న పల్స్‌పోలియో

సమావేశంలో మాట్లాడుతున్న వివిన్

ములుగు రూరల్, ఫిబ్రవరి 5 : వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా వచ్చే నెల 3న జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో వివిన్ తెలిపారు. ఆర్టీవో సత్యపాల్‌రెడ్డి అధ్యక్షతన కలెక్టరేట్‌లో వైద్యాధికారులు, సిబ్బందితో పల్స్ పోలియోపై సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 15 పీహెచ్‌సీలు, 83 సబ్ సెంటర్ల పరిధిలో 21,872మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాల్సి ఉందన్నారు. అందు కోసం 13 మొబైల్, 15 బృందాలతో 36రూల్స్ ఏర్పాటు చేసి వివిధ శాఖల అధికారుల సమన్వయంతో కార్యక్రమాన్ని పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో సీహెచ్‌వో సంపత్‌రావు, ప్రోగ్రామ్ మానిటరింగ్ సూపర్‌వైజర్ సంపత్, భాస్కర్ పాల్గొన్నారు.

జాతరలో కొబ్బరి, బెల్లం దుకాణాలు పెంచాలి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 5 : మేడారం జాతరలో ఈసారి నాలుగు కొబ్బరి, బెల్లం దుకాణాలు పెంచాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ ఐటీడీఏ పీవోకు సోమవారం గిరిజన దర్బార్‌లో వినతిపత్రం ఇచ్చారు. జాతరలో సంఘాలకు కేటాయించే మద్యం, బెల్లం, కొబ్బరి దుకాణాల కేటాయింపులో గతంలో ఉన్న కొన్ని పేర్లను తొలగించి కొత్త పేర్లను చేర్చాలని తుడుందెబ్బ నాయకుడు వట్టం జనార్దన్ కోరారు. మంగపేట మండలం మల్లూరు గ్రామానికి చెందిన పెద్ది శరణ్య కుమారి పీఏం ఈజీపీ స్కీం మంజూరు చేయాలన్నారు. ఇదే గ్రామానికి చెందిన పెద్ది సతీశ్ ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రుణం మంజూరు చేయాలని కోరారు. వ్యవసాయ భూమిలో బోరు మంజూరు చేయాలని తాడ్వాయి మండలం కాల్వపల్లికి చెందిన రైతులు సిద్దబోయిన నర్సింగారావు, నాగారాజు, చీడం రామయ్యలు విన్నవించారు. గ్రీవెన్స్‌లో ఏపీవో వసంతరావు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థులకు మెడల్స్

ఏటూరునాగారం, ఫిబ్రవరి 5 : ఖమ్మం జిల్లా కేంద్రంలో ఈనెల 4న నిర్వహించిన 11వ జాతీయ కరాటే చాంపియన్ షిప్ పోటీలో మండలంలోని రామన్నగూడెం పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. అండర్-14 కటాస్ బాలికల విభాగంలో గగ్గూరి గోపిక (గోల్డ్ మెడల్), ఇర్సవడ్ల శరణ్య, కోడి లిఖిత, అమృత, అక్షర (సిల్వర్ మెడల్స్) సాధించినట్లు కరాటే మాస్టర్ అబ్బు, హెచ్ఎం కొయ్యడ మల్లయ్య తెలిపారు. మెడల్స్‌ను ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులకు అందజేసి అభినందించారు.

ప్రజావాణిలో బిల్ కలెక్టర్‌పై ఫిర్యాదు

ములుగు, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : ములుగు గ్రామ పంచాయతీలో జరుగుతున్న అక్రమాలకు కారణమవుతున్న బిల్ కలెక్టర్ నద్దునూరి సుదర్శన్‌పై జిల్లా కేంద్రానికి చెందిన ఎంఏ ఆరీఫ్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కన ఉన్న ఖాళీ స్థలంపై ములుగు కోర్టులో కేసు ఉన్నా రబ్బానీ బేగం, అలీముల్ అసన్, కలీముల్‌హసన్‌కు నవంబర్ 2న ఇంటి నంబర్లు సృష్టించి ఇంటి పన్ను రసీదులను ఇచ్చాడని ఆరోపించారు. వాటి సాయంతో విద్యుత్ మీటర్లకు దరఖాస్తు చేయగా ఈనెల 3న సిబ్బంది మీటర్లను బిగించినట్లు తెలిపారు. కోర్టు ఆర్డర్‌ను ధిక్కరించిన బిల్ కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సమన్వయంతో సింగరేణి అభివృద్ధికి తోడ్పడాలి

జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాస్‌రావు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 5: మల్టీ డిపార్ట్‌మెంట్ సభ్యులు సమన్వయంతో పని చేస్తూ సింగరేణి అభివృద్ధికి తోడ్పడాలని భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాస్‌రావు కోరారు. సోమవారం కేటీకే-1 ఇంక్లైన్ గనిలో మల్టీ డిపార్ట్‌మెంట్ టీమ్స్‌ను ఏర్పాటు చేయగా జీఎం హాజరై మాట్లాడారు. ఏరియాలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, మిషనరీల పనితీరు వంటి విషయాలను తెలియజేయాలన్నారు. అలాగే సోమవారం జీఎం కార్యాలయంలో రీజినల్ స్థాయి ఆటల పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు జీఎం క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికులు జోనల్, రాష్ట్ర, జాతీయ స్థాయి ఆటల పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి సంస్థకు మంచి గుర్తింపు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఏజీఎం ఎస్ జ్యోతి, డీజీఎం కవీంద్ర, ఏరియా ఇంజినీర్ రామకృష్ణారెడ్డి, అధికారి ప్రతినిధి అజ్మీరా తుకారాం, ఫైనాన్స్ మేనేజర్ సురేఖ, డీవైపీఎం లు రాజు, క్రాంతి

క్రీడాకారులకు దుస్తులు అందిస్తున్న జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రావు

కుమార్, స్పోర్ట్ సూపర్ వైజర్ శ్రీనివాస్, జనరల్ కెప్టెన్ ప్రసాద్, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం, ఫిబ్రవరి 5 : నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

అన్నారు. సోమవారం మండలంలోని బుద్దారంలో రూ.3కోట్ల ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్లు, డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.25 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, రూ. 80 లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, అంతర్గత సీసీ రోడ్ల పనులకు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన స్వగ్రామమైన బుద్దారాన్ని సర్వాంగ సుందరంగా తయారు చేస్తానన్నారు. బీసీ కాలనీ నుంచి చెంచుకాలనీ వరకు వంగపెల్లి వాణి చెరువు ఆయకట్టు పరిధిలోని రైతులకు ఇబ్బందులు లేకుండా రోడ్లు నిర్మించనున్నట్లు చెప్పారు. కుల సంఘాకు కమ్యూనిటీహాళ్లు, ఉప వైద్య ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. కాంట్రాక్టర్లు పనులు త్వరగా చేపట్టి పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్, ఎంపీడీవో లెక్కల అరుంధతి, డీఈ వెంకటేశ్వర్లు, డీఈ నరేశ్, పంచాయతీ కార్యదర్శి ముక్కెర హేమంత్, మాజీ సర్పంచ్ గండ్ర ఆగంరావు, కో ఆప్షన్ మెంబర్ చోటమియా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో వచ్చే ఏడాది ప్రవేశాలు

- ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి
- కాలేజీ నిర్మాణ పనుల పరిశీలన

ములుగు, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఏర్పాటు చేస్తున్న మెడికల్ కాలేజీలో వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాలు చేపట్టి తరగతులు ప్రారంభిస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం ఆమె ప్రేమ్‌నగర్‌లో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ నిర్మాణ పనులతో పాటు 300 పడకల దవాఖాన పనులను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. తరగతి గదులు, వసతి గృహాల పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన మెడికల్ కాలేజీల ప్రిన్సిపాల్స్‌కు కాలేజీ కోసం చేపడుతున్న చర్యలను వివరించారు. విద్యార్థుల వసతి గృహం కోసం బీసీ హాస్టల్, ప్రభుత్వ దవాఖానను వైద్యాధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట మెడికల్ కాలేజీ డీన్ విమల థామస్, వరంగల్ కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, నర్సంపేట మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలాజీ, ములుగు ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చట్ట ప్రకారం విధులు నిర్వర్తించాలి

ములుగు రూరల్ : స్పెషల్ ఆఫీసర్లు పంచాయతీరాజ్ చట్టం ప్రకారం విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీఎల్ఆర్ గార్డెన్‌లో జీపీ పాలన, తాగునీటి సరఫరా తదితర అంశాలపై ప్రత్యేకాధికారులకు అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ హాజరై మాట్లాడారు. 7 నుంచి 15వ తేదీ వరకు ప్రతి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి గ్రామస్తులను భాగస్వాములను చేస్తూ విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, డీపీవో వెంకయ్య, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, జడ్పీసీఈవో ప్రసూనారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీపీఆర్వో రఫిక్, డీసీవో సర్దార్‌సింగ్ పాల్గొన్నారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సోమవారం నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీని కలెక్టర్ ప్రారంభించారు. ఈసీఐఎల్ ఇంజినీర్ల బృందంతో వివిధ పార్టీల నాయకులతో మొదటి స్థాయి తనిఖీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఉన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఓసీ-3 పనులను అడ్డుకుంటున్న బాధిత రైతులు

ఓసీ-3 పనులను అడ్డుకున్న రైతులు

గణపురం, ఫిబ్రవరి 5 : మండలంలోని ధర్మారావుపేట గ్రామ రెవెన్యూ శివారు కేటీకే ఓసీ-3లో జరుగుతున్న పనులను సోమవారం బాధిత రైతులు అడ్డుకున్నారు. ఓసీ-3 పనులు జరగుతున్న సమీపంలోనే ఉన్న భూములను సింగరేణి యాజమాన్యం తీసుకోవడం లేదని, కలెక్టర్, సింగరేణి అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా న్యాయం జరుగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓసీ-3లో తీస్తున్న బొగ్గు, బాంబు బ్లాస్టింగ్‌లతో తమ భూముల్లోని పంటలు దెబ్బతింటున్నామన్నారు. సింగరేణి అధికారులు